**పల్లవి :**

వలపారగించవమ్మ వనిత నీ-
యలుక చిత్తమున కాకలి సేసినది

**చరణాలు :**

అడియాసలనే పక్వమైన సోయగపు
వెడయలుకల మంచి వేడివేడి రుచులు
ఎడసేసి తాలిమి నెడయించి పైపైనె
పొడమిన తమకంపు బోనము పెట్టినది

ఆమంచి మధురంపు అధరామృతముల
వేమారు తావులు చల్లు వెన్నెల బయటను
కోమలపు తరితీపు కోరిక కుమ్మరించి
భామకు పూబానుపు పళ్లెము పెట్టినది

కన్నుల కాంక్షలనెడి కళవళములు తీరె
సన్నపు నవ్వులనెడి చన వగ్గలించెను
అన్నువపుమరపు నీ కంతనింత కలిగె నే-
డిన్నియును తిరువేంకటేశుని మన్ననలు

*(V-25)*